రోడ్డా.. మురికి కాలువా?

- వీవీనగర్‌లో రోడ్డుపై ఏరులై ప్రవహిస్తోన్న మురుగు నీరు
- అవస్థలు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


ముబారక్‌నగర్‌లోని వీవీనగర్ ప్రాంతంలో రోడ్డుపై ఏరులై పారుతున్న మురుగు నీరు

నిజామాబాద్‌నాగారం: అధ్వానం.. అపరిశుభ్రం.. భరించలేని కంపునకు కేరాఫ్ అడ్రస్‌గా 18వ డివిజన్ ముబారక్‌నగర్‌లో గల వీవీనగర్ ప్రాంతం కనిపిస్తోంది. మురుగు కాలువలు సక్రమంగా లేక పోవడంతో రోడ్డు మీదే ఏరులై పారుతోంది. ముబారక్‌నగర్‌లోని ప్రధాన రహదారి ఎదుట సెయింట్ జెడ్స్ స్కూల్ పక్కన కాలనీలో అక్షయ రెసిడెన్సీ వద్ద మురుగునీరు ఏరులై పారుతుంది. డ్రైనేజీ వ్యవస్థ ఒక వైపు ఉన్నా మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. మరోవైపు డ్రైనేజీ లేకపోవడంతో ఎక్కడిక్కడ ఖాళీ ప్రదేశాల్లోకి మురుగునీరు చేరుతోంది. రోజుల తరబడిగా మురుగునీరు అలాగే ఉండటంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. సమస్య పరిష్కరించాలని స్థానికులు నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు, శానిటేషన్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

మురుగు కాలువలు శుభ్రం చేయాలి



మురుగు కాలువలు నిండిపోయాయి. కాలువలు శుభ్రం చేయకపోవడంతో భరించలేని దుర్గంధం వస్తోంది. రోడ్డు మీదే మురుగు నీరు ఏరులై పారుతుంది. ఇందులోనుంచే రాకపోకలు సాగిస్తున్నాం. ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలి.

– నారాయణరెడ్డి, వీవీనగర్

ఫిర్యాదులు చేశాం



పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడుతూనే ఉన్నారు. సమస్య పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినా పట్టించుకోవడం లేదు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, జవాన్ ఇలా ఎవరు కూడా ఈవైపు రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– పురుషోత్తంరెడ్డి, వీవీనగర్

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది


కులాస్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి


రావుట్లలో.. డీసీఎంఎస్ మేనేజర్ నగేష్

మోపాల్: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తోందని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం బాడ్సి సొసైటీ పరిధిలో గల బాడ్సి, కులాస్‌పూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వైస్ చైర్మన్ రాజాకిషన్, సీఈవో నర్సయ్య, నాయకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సిరికొండ: రావుట్ల, తాళ్లరామడుగు గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మేనేజర్ నగేష్ గురువారం ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, సామేల్, భాస్కర్, గంగాదాస్, శివాజీనాయక్, విఠల్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని మెంట్రాజ్‌పల్లి సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్ సూచించారు. మెంట్రాజ్‌పల్లి, సాంపల్లి, సాంపల్లి తండాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఆర్ఐ సంతోష్, సొసైటీ వైస్ చైర్మన్ నవీన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవ్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ నాగేశ్వర్‌రావ్ ప్రారంభించారు. వైస్ చైర్మన్ పోతారెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రమోద్, సీఈవో వంశీ కృష్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.


మెంట్రాజ్‌పల్లిలో .. సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


మాధవనగర్‌లో..సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ రావు

జిల్లా క్రీడాకారులకు ఘనస్వాగతం



నిజామాబాద్‌నాగారం: ఏషియన్ సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ చాంపియన్షిప్ పోటీలల్లో సత్తా చాటి జిల్లాకు వచ్చిన క్రీడాకారులకు జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్లో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, సంయుక్త కార్యదర్శి చిప్ప నవీన్ క్రీడాకారుల తల్లిదండ్రులు ఘనంగా స్వాగతం పలికారు. గత నెల 25 నుంచి 31 వరకు తైవాన్ దేశంలో జరిగిన పోటీలలో భారత జట్టు తరఫున జిల్లా క్రీడాకారులు బి. నిశిత, జి.వర్షిని, డి.కీర్తన, ఆర్.సౌజన్య ప్రాతినిధ్యం వహించారు. టోర్నీ ముగిసిన అనంతరం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా వారు స్వాగతం పలికారు. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయి రెడ్డి వారిని అభినందించారు.

పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



నిజామాబాద్ నాగారం: పెన్షన్ రూల్స్‌ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఆమోదించి రాజ్యసభకు ఆమోదించడానికి పంపించారని, తక్షణమే దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లు, రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం బీఎస్ఎన్ఎల్ సీజీఎం, పోస్టల్ ఎస్ఎస్‌పీకి మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సాయన్న, పోస్టల్ యూనియన్ రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు ప్రతాపరెడ్డి, షేక్ హుస్సేన్, రత్నయ్య, ఎండీ అమీన్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల యూనియన్ నాయకులు ఉన్నారు.

దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ముందుకెళ్లాలి


కలెక్టరేట్‌లో కొమరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు


నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో.. బీజేపీ నాయకులు

నిజామాబాద్‌అర్బన్/మోపాల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని కలెక్టరేట్, నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి అందరికీ అనుసరణీయమని, ఆ స్ఫూర్తితో ముందుకెళ్లాలని అన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు దొడ్డి కొమురయ్య చూపిన పోరాట తెగువ స్ఫూర్తిదాయకమన్నారు.

‘సీపీఆర్ నేర్చుకోండి.. ప్రాణదాతలు కండి’

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రతి ఒక్కరూ సీపీఆర్ నేర్చుకుని అత్యవసర సమయంలో ప్రాణదాతలుగా నిలవాలని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు, నిజామాబాద్ రెడ్‌క్రాస్ డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం పేర్కొన్నారు. ధర్మారం(బి) జెడ్పీహెచ్ఎస్‌లో ఇటీవల ఎస్‌జీటీ నుంచి ఎస్ఏలుగా, పీఈటీల నుంచి పీడీలుగా పదోన్నతులు పొందిన ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీశైలం మాట్లాడుతూ.. సీపీఆర్ అనేది దేశంలో కేవలం ఒక శాతం మందికి మాత్రమే తెలుసునని, దీనిని అందరూ నేర్చుకుని ప్రాణదాతగా నిలవాలన్నారు. సీపీఆర్ ఎలా చేయాలనే అంశంపై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. వ్యాయామ ఉపాధ్యాయులతో సీపీఆర్ చేయించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.

సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి

డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంత్రిగా పని చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి పదవి ఇవ్వాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్ రెడ్డి కోరారు. గురువారం డిచ్‌పల్లి కేఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాను మరింత అభివృద్ధి చేయడానికి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచేందుకు సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌లకు విన్నవిస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని, సుదర్శన్‌రెడ్డి వారికి అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, చిన్నోల్ల నర్సయ్య, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ న్యాస రాజేశ్వర్, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు పులి వెంకటేశ్వరరావు, రాధ, రాజన్న, లక్ష్మయ్య, అశోక్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ మార్గంలో యువత నడవాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


శివాజీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ధన్‌పాల్, నేతలు

సుభాష్‌నగర్: ఛత్రపతి శివాజీ మహరాజ్ చూపిన మార్గంలో ప్రతి హిందూ యువకుడు నడవాలని, 2048 నాటికి హిందూ దేశంగా మార్చడానికి ప్రతిజ్ఞ చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం నగరంలోని నాందేవ్‌వాడ శివాజీ చౌక్‌లో శివాజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివాజీ హిందూ ధర్మ రక్షణ కోసం మొగలులను ఎదిరించి హిందూ స్వరాజ్య స్థాపనకు తన ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. నేటి యువత అక్బర్, బాబర్, ఔరంగజేబు, మొఘల్ చరిత్ర కంటే.. ఛత్రపతి శివాజీ, వీర సావర్కర్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి మహానుభావుల చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు ఎర్రం సుధీర్, మాస్టర్ శంకర్, సంజయ్ పురోహిత్, శివాజీ అభిమానులు పాల్గొన్నారు.

సన్నబియ్యంలో అధిక వాటా కేంద్రానిదే

రాష్ట్రంలో పేదలకు రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యంలో కేంద్ర ప్రభుత్వానిదే అధిక వాటా అని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం నగరంలోని నాందేవ్‌వాడ 21వ నెంబర్ రేషన్‌షాప్‌లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా రేషన్‌కార్డు, రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు 30 లక్షల దరఖాస్తులు రేషన్‌కార్డుల కోసం పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు.

అంబేడ్కర్, గాంధీ ఆశయాలను నీరుగార్చే కుట్ర

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి


మోపాల్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే

మోపాల్(నిజామాబాద్‌రూరల్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ ఆశయాలను నిర్వీర్యం చేస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లుగా పాలన సాగిస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి విమర్శించారు. గురువారం మోపాల్ మండలకేంద్రంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలోనే గుర్తింపు కలిగిన భారత రాజ్యాంగ స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తుందని ఆరోపించారు. కులాలు, మతాల ప్రకారం దేశాన్ని విభజించే కుట్ర చేస్తున్నారని, ప్రజలందరూ ఐక్యంగా ఉండి బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆర్థిక అసమానతలు తొలగించి దేశ సంపదను అందరికీ పంచడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమన్నారు. మహాత్మాగాంధీ ప్రపంచం గర్వించదగ్గ నాయకుడని, అహింసా, శాంతియుతంగానే దేశానికి స్వాతంత్ర్యం సాధించారని గుర్తుచేశారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పిస్తున్నామని, దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేస్తూ రాజ్యాంగం గురించి వివరిస్తామన్నారు. నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, పాదయాత్ర ఇన్‌ఛార్జి లింగన్న, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ కెతావత్ యాదగిరి, మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఊరుకోం


గంగారాం తండా పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి: మండలంలో వేల ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయని, వాటిని ఆక్రమిస్తే ఊరుకోమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హెచ్చరించారు. ఇందల్వాయి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎల్లారెడ్డిపల్లెలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అకాల వర్షాలకు రైతులు అధైర్య పడవద్దని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారని, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ ధాన్ల రాజు, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

సిరికొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం పర్యటిస్తారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి గురువారం తెలిపారు. తాళ్లరామడుగు, గడ్కోల్, లొంక, గోప్య తండా, మెట్టుమర్రి తండా, గడ్డమీది తండా, కొండాపూర్, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం ఎమ్మెల్యే చేస్తారని ఆయన తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	94,200	వెండి(కిలో)	1,03,500
22 క్యారెట్స్	87,135		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
బీరకాయ	50	70	దోసకాయ	25	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	12	24
కాకరకాయ	50	90	గోబిపువ్వు	40	60
వంకాయ	12	24	బీట్‌రూట్	20	40
పాలకూర	25	50	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఆదిత్య-369-11.00 మ్యాడ్ స్క్వేర్-1.30, 7.30, 10.30
స్క్రీన్-2	రాబిన్‌హుడ్-1.30, 7.30 -వీర-4.30 ఎల్‌వైఎఫ్-10.30 ఎల్-2 ఎంపురాన్(తెలుగు)-4.20, 10.30
స్క్రీన్-3	సికిందర్(హిందీ)-11.00,1.40, 4.30, 7.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	దర్(హిందీ)-10.40, 4.35 ఎ మైన్‌క్రాఫ్ట్ మూవీ (3డీ ఇంగ్లీష్)-2.15, 8.10, 10.30
స్క్రీన్-2	ఎ మైన్‌క్రాఫ్ట్ మూవీ(3డీ ఇంగ్లీష్)-10.55 రాబిన్‌హుడ్-1.55 మ్యాడ్ స్క్వేర్-4.25, 10.10 సికిందర్(హిందీ)-7.10
స్క్రీన్-3	సికిందర్(హిందీ)-10.30, 1.30, 4.30, 10.35 ఎల్‌వైఎఫ్-7.30
స్క్రీన్-4	వృషభ-11.00 -వీర-2.00 28సీ-4.50 -రాబిన్‌హుడ్-7.15 ఆదిత్య369-10.25
లలితామహల్	కోర్ట్, దేవి రాబిన్‌హుడ్
నటరాజ్	షణ్ముఖ, విజయ్ మ్యాడ్ స్క్వేర్

క్లుప్తంగా

సమాజ సేవను అలవర్చుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవను అలవర్చుకోవాలని తెయూ వీసీ టి యాదగిరి రావు పేర్కొన్నారు. తెయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-4 సంయుక్త ఆధ్వర్యంలో గురువారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలో ఏర్పాటు చేసిన వేసవి ప్రత్యేక శిబిరాన్ని వీసీ ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజసేవతో పాటు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో పీఆర్వో పున్నయ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు స్రవంతి, స్వప్న, మాజీ సర్పంచ్ పానుగంటి రూప సతీశ్, పంచాయతీ కార్యదర్శి కవి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి



సిరికొండ: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణుల వివరాలను నమోదు చేయాలని అన్నారు. ఆరోగ్య కార్యక్రమాల గురించి సమీక్ష చేశారు. మెడికల్ ఆఫీసర్ అరవింద్, నిర్మల, మండోదరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొరం బహిరంగ వేలం

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం గ్రామంలో గురువారం బహిరంగ మొరం తవ్వకాలకు సంబంధించిన వేలం పాట పాడారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి రూ.2 లక్షల 50 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వ్యక్తి సంవత్సరానికి గాను గుండారం గ్రామానికి సరఫరా చేయాల్సి ఉంటుంది. దీంతో గ్రామంలో అవసరం ఉన్న వారికి మొరాన్ని అందించడం, నూతన గృహాలకు మొరం సరఫరా వంటివి చేయాల్సి ఉంటుంది.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను ఎస్‌హెచ్‌వో రఘుపతి తనిఖీ చేశారు. రైల్వేప్లాట్‌ఫారం, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగున్న వారి బ్యాగులను తనిఖీలు చేసి వివరాలు సేకరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నా, గంజాయి అమ్ముతున్నా 100 నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలని తెలిపారు. నలుగురు ఎస్సైలు, 25 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ప్రెసిడెన్సీ’ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రతిష్టాత్మక గౌరవం



మోపాల్(నిజామాబాద్‌రూరల్)/నిజామాబాద్ అర్బన్: మండలంలోని తాడెంలోగల ప్రెసిడెన్సీ హైస్కూల్ విద్యార్థులు నేషనల్ స్పేస్ సొసైటీ(ఎన్ఎస్ఎస్) ప్రతిష్టాత్మకమైన యంగర్ హానరబుల్ మెన్షన్ పురస్కారం అందుకున్నారని ప్రిన్సిపాల్ పవన్ కుమార్ గురువారం తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ గ్లోబల్ పోటీల్లో విద్యార్థులు ×ఏయూఆర్ఏ× ప్రాజెక్టును రూపొందించారని, ఈ ప్రాజెక్టుకు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఏయూఆర్ఏ ప్రాజెక్ట్ ద్వారా భవిష్యత్‌లో అంతరిక్ష నివాస స్థలాలపై గొప్ప పరిశోధనలు చేసే అవకాశం విద్యార్థులు పొందారని, ఈ ఘనత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులు జి రిత్విక్ విరాట్, షిండే సాయి గణేష్, ఏ ఈశ్వర్‌రెడ్డి, ఉషం నోవా ఫిలేమాన్, మిథిలేశ్ మహాజన్‌ను పాఠశాల చైర్‌పర్సన్ నల్ల శమంతారెడ్డి, ప్రిన్సిపాల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వర్సిటీ భూముల్ని అప్పగించాలి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ కళాశాల వద్ద తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాలను ప్రభుత్వం అభివృద్ధి పేరుతో కాజేయాలని చూస్తోందని వారు పేర్కొన్నారు. వెంటనే భూములను యూనివర్సిటీకి అప్పగించాలన్నారు. నిరసన కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కల్యాణ్ రామ్, సుజిత్, ధర్మేందర్, మహేష్, యశ్వంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

30 కిలోల గోటి తలంబ్రాల అందజేత

నిజామాబాద్ రూరల్: భద్రాచలం సీతారాముల కల్యాణానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 250 కిలోల గోటి తలంబ్రాల సేకరణకు గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ శ్రీకారం చుట్టింది. ఆ సంస్థ పిలుపు మేరకు గ్రామ, గ్రామాన వేలాది భక్తులు పాల్గొని గోటితో వడ్లను ఒలిచి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం నగరంలోని కోటగల్లీలో గల మార్కండేయ స్వామి దేవాలయంలో గోటితో కొన్ని రోజుల నుంచి వడ్లను ఒలిచి 30 కిలోలకు పైగా తలంబ్రాలుగా తయారుచేశారు. భద్రాచలం వెళుతున్న రామకోటి రామరాజుకు కలశాలతో వాటిని అందజేశారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

నిజామాబాద్ సిటీ: ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసులపై జరుగుతున్న హింస, దౌర్జన్యాలు, ఎన్‌కౌంటర్ పేరుతో జరుగుతున్న హత్యలను ఖండిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించి అనంతరం జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో అభివృద్ధి పేరుతో ప్రకృతి సంపదను ధ్వంసం చేయడాన్ని తప్పుపట్టారు. ప్రశ్నించే శక్తులను కేంద్రం భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఆపరేషన్ కగార్‌కి వ్యతిరేకంగా ఏప్రిల్ 8న హైదరాబాదు ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతంచేయాలన్నారు. నాయకులు భూమయ్య, సాయిబాబా, శివకుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న మేకల సాయిలు (55) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన సాయిలు గత తొమ్మిదేళ్ల నుంచి ఆదర్శ పాఠశాలలో(ప్రైవేట్) అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటి లాగే గురువారం ఉదయం పాఠశాలకు వచ్చిన సాయిలు ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయాడు. వెంటనే పాఠశాల సిబ్బంది ఆస్పత్రికి తరలించేలోపే సాయిలు మృతి చెందాడు. అంత్యక్రియలకు ఉపాధ్యాయులు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

నిజామాబాద్ రూరల్: ఆకుల కొండూరులో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. నేటి నుంచి వారం రోజులపాటు గ్రామంలో ప్రత్యేక శిబిరం ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ వారం రోజుల లో కళాశాలకు చెందిన దాదాపు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో వివిధ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, అక్షరాస్యత, ప్లాస్టిక్, మాదకద్రవ్యాల నిర్మూలన మొదలగు వాటిపై గ్రామస్తుల్లో అవగాహన పెంపొందిస్తారని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్, వీడీసీ సభ్యులు, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్-1 ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరమణ తదితరులున్నారు.